క్లుప్తంగా

ప్రశాంతత అవసరం

భద్రాచలంటౌన్: ఆర్టీసీ డ్రైవర్లు విధులకు హాజరయ్యే సమయంలో మానసిక ప్రశాంతతతో అర్ధగంట ముందుగా డ్యూటీకి వచ్చి అధికారుల కేటాయించిన బస్సులను చెక్ చేసుకోవాలని భద్రాచలం మోటార్ వెహికల్ ఇన్స్పెక్టర్ కిషన్ రావు అన్నారు. భద్రాచలం ఆర్టీసీ డిపో ఆధ్వర్యంలో ప్రమాద రహిత వారోత్సవాల్లో భాగంగా బుధవారం డిపో మేనేజర్ తిరుపతి ఆధ్వర్యంలో నిర్వహించిన ప్రారంభ వేడుకలో ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. డ్రైవర్లు ఎదురుగా వస్తున్న వాహనాలను గమనించి డ్రైవింగ్ చేయాలని, సెల్ ఫోన్ మాట్లాడుతూ డ్రైవింగ్ చేయొద్దని సూచించారు. అసిస్టెంట్ మేనేజర్ గౌతమి, అసిస్టెంట్ మెకానికల్ ఇంజనీర్ వెంకటేశ్వరరావు, స్టేషన్ మేనేజర్ అల్లం నాగేశ్వరావు, డ్రైవర్లు, మెకానిక్ సిబ్బంది ఆర్టీసీ ఉద్యోగులు పాల్గొన్నారు.

సంక్షేమంపై నిర్లక్ష్యం

మణుగూరుటౌన్: సింగరేణి కాలరీస్ మణుగూరు ఏరియాలోని ఓసీ–4 అధికారులు కేవలం బొగ్గు ఉత్పత్తి లక్ష్య సాధనకు మాత్రమే లక్ష్యంగా పనిచేస్తూ కార్మికుల సంక్షేమాన్ని పక్కన పెట్టారని ఏటీయూసీ బ్రాంచ్ సెక్రటరీ వై.రాంగోపాల్ విమర్శించారు. బుధవారం ఏఐటీయూసీ నాయకులు ఓసీ–4ను సందర్శించి కార్మికుల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. రక్షణ చర్యల లోపంతో పాటు రెస్ట్ షెల్టర్, ఫస్ట్ ఎయిడ్ సెంటర్, సీహెచ్‌పీకి వెళ్లే దారి సరిగా లేక తీవ్ర ఇబ్బందులు పడుతున్నామని కార్మికులు వివరించారు. కార్మికుల పట్ల అధికారుల వ్యవహార శైలి మార్చుకోవాలని నాయకులు సూచించారు. నంబూరు శ్రీనివాసరావు, ఎగ్జిక్యూటివ్ మెంబర్ కందిమల్ల శ్రీనివాసరావు తదితరులు ఉన్నారు.

ఆర్థిక సాయం

భద్రాచలంటౌన్: పట్టణంలోని వైకుంఠదామంలో నివాసం ఉంటున్న మహిళా కాటికాపరి ముత్యాల అరుణకి పాల్వంచ జనహిత ఫౌండేషన్ ఆధ్వర్యంలో బుధవారం రూ.5వేలు ఆర్థిక సహాయం అందించారు. దుస్తువులు, పండ్లు వితరణ చేశారు. ఈ సందర్భంగా ఫౌండేషన్ సభ్యులు మాట్లాడుతూ.. అరుణ కాటి కాపరి పనినే జీవనాధారంగా జీవిస్తూ.. మరో పది మంది అనాథ పిల్లని పోషిస్తోందని తెలిపారు.

గిరిజన విద్యార్థికి..

భద్రాచలంటౌన్: చర్ల మండలం మారుముల గ్రామం పూసగుప్ప గ్రామానికి చెందిన నిరుపేద విద్యార్థి మడకం సూరి బాబుకు ఉన్నత చదువుల కోసం మదర్ తెరిసా చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో డాక్టర్ అక్కినేని లోకేష్ రూ.5 వేల ఆర్థిక సాయం అందజేశారు. ట్రస్ట్ వ్యవస్థాపకుడు కొప్పుల మురళి, చోళ ఇన్సూరెన్స్ మేనేజర్ బాలరాజు, సాయిబా, కోమటిరెడ్డి చైతన్య, జిలకర నాగరాజు పాల్గొన్నారు.

కుర్నపల్లిలో వైద్య శిబిరం

చర్లరూరల్: చర్ల మండలం సత్యనారాయణపురం పీహెచ్‌సీ పరిధిలోని కుర్నపల్లి గ్రామంలో డాక్టర్ దివ్యనయన ఆధ్వర్యంలో బుధవారం వైద్య శిబిరం నిర్వహించారు. 80 మందికి వైద్య పరీక్షలు చేసిన అనంతరం వారికి కావలసిన మందులు అందజేశారు. డీపీఎంఓ సత్యనారాయణ, హెచ్ఈఓ బాబూరావు, హెల్త్ అసిస్టెంట్ వేణు, కవిత, ఆశా కార్యకర్త కనకమ్మ పాల్గొన్నారు.

రైతులకు మళ్లీ రుణాలు

ములకలపల్లి: రుణమాఫీ పొందిన సంఘ రైతులకు మళ్లీ కొత్త రుణాలు మంజూరు చేయనున్నట్లు పీఏసీఎస్ చైర్‌పర్సన్ నడిపల్లి సునంద బుధవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఆసక్తిగల సంఘ సభ్యులు పాస్‌ఫొటోలు–2, ఆధార్ కార్డు కలర్ జిరాక్స్–2, పట్టాపాస్ బుక్ జిరాక్స్–2, పహాణీ, వన్‌బి ఫాం, నామినీ ఆధార్ కార్డుల జిరాక్స్‌లు తమ వెంట తేవాలని తెలిపారు. మరిన్ని వివరాలకు ములకలపల్లిలోని సంఘ కార్యాలయ సీఈఓ మురళిని సంప్రదించాలని ఆమె సూచించారు.

మందులు పంపిణీ

దుమ్ముగూడెం: మండలంలోని నర్సాపురం ప్రాథమిక ఆరోగ్యకేంద్రం పరిధిలోని మహాదేవపురం గ్రామంలోని జ్వర పీడితులకు డాక్టర్ సుభాష్ బుధవారం మందులను అందజేశారు. మహాదేవపురం గ్రామంలో పర్యటించి జ్వర పీడితులను పరామర్శించారు. వారికి మందులను అందజేశారు. వైద్య సిబ్బంది, ఆశ వర్కర్‌లు పాల్గొన్నారు.

బదిలీలను నిలిపివేయాలి

మణుగూరుటౌన్: సింగరేణి కాలరీస్ మణుగూరు ఏరియాలోని ఫిట్టర్ బదిలీల నిర్ణయాన్ని ఉపసంహరించుకోవాలని టీబీజీకేఎస్ బ్రాంచ్ ఉపాధ్యక్షుడు నాగెల్లి బుధవారం ఎస్ఓటూ జీఎం శ్యాంసుందర్‌కు వినతిపత్రం అందజేశారు. కార్మికుల పిల్లల చదువులు, ఉత్పత్తి ఉత్పాదకతలపై వారి బదిలీ ప్రభావాన్ని దృష్టిలో ఉంచుకుని ఆ నిర్ణయాన్ని వెనక్కు తీసుకోవాలని విన్నవించారు. కార్యక్రమంలో మస్తాన్, నాగేశ్వరరావు, బంగారి పవన్, వినయ్‌కుమార్, బత్తుల శ్రీనివాస్ ఉన్నారు.

మరమ్మతులు చేపట్టాలి

బూర్గంపాడు: నిజాం కాలం నాటి బూర్గంపాడు ప్రభుత్వ ఆస్పత్రికి తక్షణమే మరమ్మతులు చేపట్టి వైద్యసేవలకు ఇబ్బందులు కలగకుండా చూడాలని సీపీఐ(ఎంఎల్)న్యూడెమోక్రసీ డివిజన్ నాయకుడు పున్నంచంద్ కోరారు. బుధవారం విడుదల చేసిన ఓ ప్రకటనలో బూర్గంపాడు ప్రభుత్వ ఆస్పత్రి భవనాల శ్లాబులు కురుస్తూ వైద్యులకు, రోగులకు ఇబ్బందికరంగా మారిందని తెలిపారు.

విద్యుత్ శాఖపై బకాయిల బండ

- భద్రాచలం పట్టణంలో రూ.8.54 కోట్ల బిల్లులు పెండింగ్
- రూ.2కోట్లు దాటిన హోంశాఖ లెక్క..
- ప్రజావసరాలు కావడంతో విద్యుత్ అధికారులు మౌనం


భద్రాచలం విద్యుత్ సబ్ స్టేషన్

భద్రాచలంఅర్బన్: భద్రాచలం విద్యుత్ శాఖ పరిధిలో దాదాపు రూ.8.54 కోట్ల బకాయిలు పేరుకు పోయాయి. ప్రభుత్వ బడ్జెట్ వచ్చినప్పుడే కొంత మొత్తం బకాయిల చెల్లింపు జరుగుతోంది. ఎప్పుడు బడ్జెట్ వచ్చినా పంచాయతీలు, ప్రభుత్వ కార్యాయాలకు చెందిన వారు కొంత మొత్తం మాత్రమే చెల్లిస్తూ మిగిలిన నిధులను మౌలిక అవసరాలకు ఉపయోగిస్తున్నారు. దీని కారణంగా నెల నెలా బకాయిల మొత్తం పెరిగిపోతోంది. బకాయిల చెల్లింపుపై పలు దఫాలుగా నోటీసులు ఇచ్చిన కేవలం ప్రభుత్వం నుంచి వచ్చే నిధుల నుంచి మాత్రమే బిల్లులు చెల్లిస్తామని చెపుతుండటంతో అధికారులు ఏం చేయలేని పరిస్థితి నెలకొంది. భద్రాచలం మేజర్ పంచాయతీ సైతం బకాయిల చెల్లింపుపై దృష్టి పెట్టలేకపోతున్నాయి. ప్రధానంగా నీటి అవసరాలు, వీధి లైట్ల కోసం ఎక్కువగా విద్యుత్‌ను ఉపయోగిస్తుండటంతో అధికారులు సైతం కఠినంగా వ్యవహరించలేకపోతున్నారు.

శాఖల వారీగా ఇలా..

భద్రాచలం విద్యుత్ పరిధిలో రూ.8.54 కోట్ల బకాయిలున్నాయి. ఇందులో పశుసంవర్ధక శాఖ నుంచి రూ.1.66 లక్షలు, బీసీ వెల్ఫేర్ నుంచి రూ.లక్ష, వైద్య(హెచ్ఎస్టీ) నుంచి రూ.6.43 లక్షలు, అగ్నిమాపక శాఖ నుంచి రూ.32వేలు, ఆహార శాఖ నుంచి రూ.19వేలు, అటవీ శాఖ నుంచి 12.76 లక్షలు, గిరిజన కార్పొరేషన్ నుంచి రూ.19 వేలు, వైద్య శాఖ నుంచి రూ.30 లక్షలు 89 వేలు చెల్లించాల్సి ఉంది. హోం శాఖ నుంచి రూ.2.99 కోట్ల 71 వేలు, ఇరిగేషన్ శాఖ నుంచి రూ.17వేలు, జ్యూడీషియల్ శాఖ నుంచి రూ.3 వేలు, మేజర్ పంచాయతీ పనుల నుంచి రూ.21లక్షల 22 వేలు, మేజర్ స్ట్రీట్ లైట్స్ నుంచి రూ.44 లక్షల 97 వేలు, మార్కెట్ కమిటీ నుంచి రూ.1.59 లక్షలు, మైనర్ పంచాయతీ నీటి పనుల నుంచి రూ.1.35 కోట్ల 15 వేలు, మైనర్ స్ట్రీట్ లైట్స్ నుంచి రూ.32 లక్షలు 9 వేలు, పబ్లిక్ వర్క్స్, ఆర్అండ్ బి నుంచి రూ.7 లక్షల 38 వేలు, పంచాయతీ రాజ్ నుంచి రూ.62 లక్షలు 54 వేలు, రెవెన్యూ శాఖ నుంచి రూ.78 లక్షల 67 వేలు, విద్య శాఖ(స్కూల్) నుంచి రూ.71లక్షల 33వేలు, టెలిఫోన్ ఎక్స్చేంజ్ నుంచి రూ.81 వేలు, ఉమెన్ డెవలప్మెంట్ అండ్ చైల్డ్ వెల్ఫేర్ నుంచి రూ.37 వేలు, ట్రైబల్ వెల్ఫేర్ నుంచి రూ.47 లక్షల 98 వేలు తో పాటు ఇదే విధంగా ఇతర ప్రభుత్వ శాఖల నుంచి భద్రాచలం విద్యుత్ శాఖకు కోట్లలో విద్యుత్ బకాయిలు చెల్లించాల్సి ఉంది.

వరదల తాలూకా బకాయిలే..

ఇదిలా ఉండగా భద్రాచలంలో గోదావరి వరదల వచ్చిన సమయంలో ప్రతి ఏడాదీ స్లూయిస్‌ల వద్ద ఏర్పాటు చేసే విద్యుత్ మోటార్లకు అందించే విద్యుత్‌కు సంబంధించిన బకాయిలపై ఇటు గ్రామ పంచాయతీ, అటు ఇరిగేషన్ శాఖ అధికారులు ఆ బిల్లు మాది కాదంటే మాది కాదని రెండు ఏళ్లుగా ఆ శాఖల అధికారులు కాలయాపన చేస్తున్నారు. ఇలా విద్యుత్ శాఖకు రూ.80 లక్షల వరకు బకాయిలు చెల్లించాల్సి ఉంది. మళ్లీ ఇప్పుడు వరదలు వచ్చే సమయం కావడంతో జిల్లా కలెక్టర్ జితేష్ పాటిల్, భద్రాచలం ఐటీడీఏ పీవో రాహుల్ దృష్టి సారించి పాత బకాయిల చెల్లింపునకు చర్యలు తీసుకుంటారని విద్యుత్ శాఖ అధికారులు ఆశిస్తున్నారు.

ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లాం



భద్రాచలం పట్టణ పరిధిలోని విద్యుత్ బకాయిల వసూళ్లపై చర్యలు తీసుకుంటున్నాం. బకాయిల పెండింగ్‌పై ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లాం. ప్రతి నెలా బకాయిలపై రివిజన్ చేస్తున్నాం. గతంలో పలుమార్లు ప్రభుత్వ కార్యాలయాలు, పంచాయతీకి నోటీసులు పంపాం. అప్పట్లో వచ్చిన ప్రభుత్వ బడ్జెట్‌లో కొంత భాగం జమ చేశారు.

– వేణు, విద్యుత్ శాఖ ఏడీఈ, భద్రాచలం

రెండోసారి దెబ్బతిన్న బ్రిడ్జి


బ్రిడ్జి రివిటింగ్ దిమ్మెలకు తాత్కాలిక మరమ్మతులు చేస్తున్న దృశ్యం

మణుగూరురూరల్: కూనవరం గ్రామపంచాయతీ రైల్వేగేట్ సమీపంలోని కోడిపుంజుల వాగుపై నిర్మించి లోలెవల్ బ్రిడ్జి మరోమారు దెబ్బతిన్నది. కార్మికులు, ప్రజల కోసం రూ.80లక్షల అంచనా వ్యయంతో సింగరేణి యాజమాన్యం నిర్మించిన ఈ బ్రిడ్జి.. ఏడాది గడవకముందే క్రుంగిపోయింది. గతంలో బ్రిడ్జిని ప్రారంభించిన నెలరోజుల్లోపే వరద ఉధృతికి కొట్టుకుపోయింది. ఆనాడు అధికారులు తాత్కాలిక మరమ్మతులు చేసినప్పటికీ.. మళ్లీ ఏడాది తర్వాత ప్రస్తుతం వరద తాకిడికి బ్రిడ్జి రివిటింగ్ దిమ్మెలు బలహీనపడుతున్నాయి. ఇప్పుడు కూడా రివిటింగ్ దిమ్మెలకు తాత్కాలిక మరమ్మతులు చేస్తున్నారే.. తప్ప శాశ్వత పరిష్కారం కోసం చర్యలు చేపట్టడం లేదని కార్మికులు పేర్కొంటున్నారు. ఇంజనీర్ల డిజైన్ లోపమో..? లేక బ్రిడ్జి నిర్మాణం చేపట్టినా కాంట్రాక్టర్ నాణ్యతా లోపమో...? కార్మికుల పాలిట శాపంగా మారింది.

పరిశీలించిన ఎంపీటీసీ

క్రుంగిన కోడిపుంజుల లోలెవల్ బ్రిడ్జిని కూనవరం ఎంపీటీసీ గుడిపూడి కోటేశ్వరరావు బుధవారం సందర్శించారు. చేపడుతున్న తాత్కాలిక మరమ్మతు పనులను పరిశీలించారు. బ్రిడ్జి నిర్మాణం చేపట్టిన కాంట్రాక్టర్, సింగరేణి అధికారుల అవగాహన లేమితోనే గతంలో పనులు నిర్లక్ష్యంగా జరిగాయని ఆరోపించారు. శాశ్వత పరిష్కారం చూపాలని అధికారులను కోరారు.

రైతులందరికీ మాఫీ చేయాలి

అన్నపురెడ్డిపల్లి: ఎటువంటి నిబంధనలూ లేకుండా రెండు లక్షల వరకు రుణం కలిగిన ప్రతి రైతుకూ రుణమాఫీ చేయాలని గుంపెన సొసైటీ చైర్మన్, బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు బోయినపల్లి సుధాకర్ డిమాండ్ చేశారు. బుధవారం మండలంలోని గుంపెన సొసైటీలో ఏర్పాటు చేసిన విలేఖర్ల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఈ మేరకు సొసైటీ సీఈఓ సున్నం వెంకటేశ్వర్లుకు వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో సొసైటీ సిబ్బంది సురేందర్, వేణు, రాములు, హరీష్, రైతులు అప్పయ్య, లక్ష్మి, రాము తదితరులు పాల్గొన్నారు.

బీఆర్ఎస్ ధర్నా..

చండ్రుగొండ: ఎలాంటి షరతులూ లేకుండా రైతు రుణాలు మాఫీ చేయాలని డిమాండ్ చేస్తూ.. బీఆర్ఎస్ నాయకులు బుధవారం తహసీల్దార్ కార్యాలయం ఎదుట ధర్నా చేపట్టారు. అనంతరం ఆర్ఐ అక్బర్‌కు డిమాండ్లతో కూడిన వినతిపత్రాన్ని అందించారు. పార్టీ నాయకుడు, వైస్ ఎంపీపీ నరుకుళ్ళ సత్యనారాయణ, దారా వెంకటేశ్వరరావు, నల్లమోతు వెంకటనారాయణ, మోదా మోహన్ రావు, ఉన్నం నాగరాజు, పొండ్ల అంజన్‌రావు తదితరులు పాల్గొన్నారు.

కలెక్టర్ ఆదేశాలు బేఖాతరు


కొత్తూరు స్కూల్ ఆవరణలో నీరు నిల్వ ప్రదేశాన్ని పరిశీలిస్తున్న కలెక్టర్ జితేష్ వి.పాటిల్ (ఫైల్)

ములకలపల్లి: 'గ్రావెల్ లాంటివి పోసి తాత్కాలిక పనులు చేయకండి. ఇంకుడుగుంత తవ్వించి, శాశ్వత పరిష్కారం చూడండి'అంటూ స్వయంగా జిల్లా కలెక్టర్ జితేష్ వి.పాటిల్ అధికారులను ఆదేశించినా.. స్పందన కానరావట్లేదు. ఈ నెల 12వ తేదీన మండలపరిధిలోని కొత్తూరు గ్రామాన్ని జిల్లా కలెక్టర్ సందర్శించిన క్రమంలో స్థానిక ప్రాథమిక పాఠశాలను అకస్మికంగా తనిఖీ చేశారు. పాఠశాల ఆవరణలో వాననీరు నిలిచి ఉండడాన్ని గమనించిన కలెక్టర్, అధికారులపై ఆగ్రహం వ్యక్తం చేశారు. యుద్ధప్రాతిపదికన శాశ్వతంగా నీరు తొలగించేలా చర్యలు తీసుకోవాలని స్పష్టం చేశారు. గ్రావెల్ పోస్తామని గ్రామపంచాయతీ అధికారులు చెప్పడంతో ఆయన అసహనం వ్యక్తం చేశారు. తాత్కాలిక పనులు వద్దని, శాశ్వతంగా పరిష్కారం చూడాలన్నారు. ఇంకుడుగుంత తీసి, నిల్వనీరు వెళ్లేలా చూడాలని ఆదేశించారు. 'మీరు చేస్తారా..? లేక నేనే పలుగూ, పార పట్టి పనిచేయాలా..?'అంటూ ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇది జరిగి పది రోజులు దాటుతున్నా, నేటికీ జిల్లా బాస్ ఆదేశాలు ఆచరణకు నోచుకోలేదు. ఇటీవల విస్తరంగా వర్షాలు కురుస్తున్న క్రమంలో నీటి నిల్వ ప్రదేశంలో ఇసుక పోసి చేతులు దులుపుకున్నారు. అధికారుల తీరుపట్ల స్థానికులు ముక్కున వేలేసుకుంటున్నారు. ఈ విషయమై వీకే.రామవరం జీపీ కార్యదర్శి రవీందర్‌ను 'సాక్షి'వివరణ కోరగా .. నీరు నిల్వ ఉండకుండా ఇసుక నింపినట్లు తెలిపారు. విస్తారంగా వర్షాలు కురుస్తున్న క్రమంలో ఇంకుడుగుంత తీయడంలో ఆలస్యమైందని అన్నారు. వెంటనే పనులు చేపడతామన్నారు.

బాధ్యతలు చేపట్టిన తహసీల్దార్



దుమ్ముగూడెం: దుమ్ముగూడెం మండల తహసీల్దార్‌గా మణిధర్ బుధవారం బాధ్యతలు చేట్టారు. ఇక్కడ విధులు నిర్వహిస్తున్న పి.చంద్రశేఖర్ సిద్దిపేట జిల్లాకు బదిలీ కావడంతో భద్రాచలం డిప్యూటీ తహసీల్దార్‌గా విధులు నిర్వహిస్తున్న మణిధర్‌ను ఇక్కడ నియమించారు. బాధ్యతలు చేపట్టిన తహసీల్దార్‌కు ఆర్ఐలు, కార్యాలయ సిబ్బంది అభినందనలు తెలిపారు.

ఇసుక ట్రాక్టర్ల అడ్డగింత

అశ్వారావుపేటరూరల్: అనుమతులు లేకుండా అక్రమంగా ఇసుక తరలిస్తున్న ట్రాక్టర్లను బుధవారం గ్రామస్తులు అడ్డుకున్నారు. మండలంలోని ఖమ్మంపాడు వాగు నుంచి మూడు ట్రాక్టర్లలో ఇసుక తరలిస్తుండగా, గమనించిన నారాయణపురం గ్రామస్తులు వాటిని నిలిపివేశారు. ఇసుక తరలించేందుకు ఏలాంటి అనుమతి లేకపోవడంతో ట్రాక్టర్ల యాజమానులు, గ్రామస్తుల మధ్య కొద్దిసేపు వాగ్వాదం చోటుచేసుకుంది. అనంతరం పెద్దలు ఇసుక తరలింపుకు అనుమతి ఉంటేనే రవాణా చేసుకోవాలని చెప్పి, పట్టుకున్న ట్రాక్టర్లను వదిలేశారు.

రేపు ఇసుక వేలం

గుండాల: మండలంలోని సాయన్నపల్లి పంచాయతీ పరిధిలో కిన్నెరసాని నది ఒడ్డున అక్రమంగా నిల్వచేసిన ఇసుకకు ఈ నెల 26న వేలంపాట నిర్వహించనున్నట్లు తహసీల్దార్ ఇమ్మానుయేల్ బుధవారం ఓ ప్రకటనలో తెలిపారు. ఇసుక మొత్తం విలువ రూ.2,69,405లు ఉంటుందని, ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని విజ్ఞప్తి చేశారు.

ర్యాపిడ్ ఫీవర్ సర్వే

చర్లరూరల్: మండలంలోని సత్యనారాయణపురం పీహెచ్‌సీ పరిధిలోని ఆర్.కొత్తగూడెం, కుదునూరు, తేగడ, చర్ల మెయిన్ రోడ్‌లలో వైద్య సిబ్బంది బుధవారం ర్యాపిడ్ ఫీవర్ సర్వేలు నిర్వహించారు. ఇంటింటికి వెళ్లి నీటి నిల్వలను తొలగించాలని సూచించారు. పలు ఆరోగ్య సూచనలు చేశారు.

కల్వర్టు నిర్మించండి

దుమ్ముగూడెం: మండలంలోని అచ్యుతాపురం గ్రామంలోకి వెళ్లేందుకు మధ్యలో ఉన్న కల్వర్టు నిర్మాణం తక్షణమే చేపట్టాలని, లేని పక్షంలో జాతీయ రహదారిపై రాస్తారోకో చేపడతామని ఏఎస్పీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు సోయం కామరాజు హెచ్చరించారు. కల్వర్టుకు భారీ గొయ్యి పడటం వల్ల వాహనాలు పోలేక ఇబ్బందులు పడుతున్నామని తక్షణమే కల్వర్టు నిర్మాణం చేపట్టి రోడ్డు నిర్మాణం చేపట్టాలని డిమాండ్ చేశారు.

ముంపు నుంచి రక్షించాలి

భద్రాచలంఅర్బన్: గోదావరి వరద ముంపు నుంచి ఏఎంసీ కాలనీని రక్షించాలని సీపీఎం పట్టణ కమిటీ అధికారులకు విజ్ఞప్తి చేసింది. బుధవారం కాలనీలోకి చేరిన వరద ప్రాంతాన్ని సీపీఎం బృందం పరిశీలించింది. ఈ సందర్భంగా పార్టీ జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు ఎంబి నర్సారెడ్డి, పట్టణ కార్యదర్శి గడ్డం స్వామిలు మాట్లాడుతూ.. రానున్న రోజుల్లో వర్షాలు ఎక్కువగా పడినా, లేదా గోదావరి నీటిమట్టం పెరిగినా కాలనీ ముంపు గురయ్యే ప్రమాదం ఉందని, సంబంధిత అధికారులు తక్షణమే స్పందించి తగు చర్యలు చేపట్టాలని డిమాండ్ చేశారు. పార్టీ నాయకులు వై.వెంకటరామారావు, పి.సంతోష్ కుమార్, జ్యోతి, సత్యవతి, సీత, రమాదేవి, కృష్ణవేణి, కళావతి, తదితరులు పాల్గొన్నారు.

నాగభూషణం సేవలు మరువలేనివి


దుమ్ముగూడెం: నాగభూషణం స్తూపం వద్ద నివాళులర్పిస్తున్న నాయకులు

భద్రాచలంఅర్బన్: దివంగత సీపీఐ నాయకుడు రావులపల్లి నాగభూషణం ఏజెన్సీ ప్రాంతం అభివృద్ధికి నిరంతరం కృషి చేసిన నాయకుడని ఆ పార్టీ రాష్ట్ర సమితి సభ్యుడు కల్లూరి వెంకటేశ్వరరావు అన్నారు. బుధవారం రావులపల్లి నాగభూషణం 9వ వర్ధంతి సభ స్థానిక సీపీఐ కార్యాలయంలో నిర్వహించారు. కార్యక్రమానికి ఏఐటీయూసీ నాయకుడు మారెడ్డి శివాజీ అధ్యక్షత వహించగా.. నాయకులు నాగభూషణం చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం కల్లూరి మాట్లాడుతూ.. సమస్యల పరిష్కారంలో నాగభూషణం కృషిని వివరించారు. కార్యక్రమంలో పట్టణ పార్టీ నాయకులు ఏపూరి వెంకటేశ్వరరావు, మహేష్, కొండబాబు, త్రిమూర్తులు, సాధనపల్లి సతీష్, పితాని మనస్సే, కొక్కిరేణి అశోక్ కుమార్, కంభంమెట్టు శ్రీనివాస్, ఎండి వలి, కవిటపు మహేష్, కరుణ కుమారి తదితరులు పాల్గొన్నారు.

దుమ్ముగూడెం: రావులపల్లి నాగభూషణం ఆశయ సాధన కోసం పని చేద్దాని సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యుడు రావులపల్లి రవికుమార్, బీఆర్ఎస్ పార్టీ జిల్లా నాయకులు రావులపల్లి రాంప్రసాద్ పిలుపునిచ్చారు. బుధవారం నర్సాపురం గ్రామంలో నాగభూషణం 9వ వర్ధంతిని నిర్వహించారు. ఈ సందర్భంగా నివాళులు అర్పించిన అనంతరం వారు మాట్లాడారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ కుంజా లక్ష్మయ్య, సొసైటీ చైర్మన్ కిలిమి ఎల్లారెడ్డి, నాయకులు బొల్లోజు వేణు, తాటపూడి రమేష్, చంచల కృష్ణ, నరసింహారావు, బీఆర్ఎస్ పార్టీ నాయకులు ఆకోజ్ సునీల్ కుమార్, రావులపల్లి పృథ్వీ, రామకృష్ణ, రామిరెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

కేటీఆర్ జన్మదిన వేడుకలు

టీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కల్వకుంట్ల తారక రామారావు (కేటీఆర్) జన్మదిన వేడుకలను పలుచోట్ల బుధవారం ఘనంగా నిర్వహించారు. ఆయా ప్రాంతాల్లోని పార్టీ నాయకుల ఆధ్వర్యంలో కేక్ కట్‌చేసి కార్యకర్తలకు పంచిపెట్టారు. ఆస్పత్రిలో అనారోగ్య బాధితులకు పండ్లు, బ్రెడ్ ప్యాకెట్లను పంపిణీ చేశారు. కార్యక్రమాల్లో పార్టీ ముఖ్య నాయకులు, ప్రజాప్రతినిదులు పాల్గొని విజయవంతం చేశారు.

– సాక్షి నెట్‌వర్క్


దమ్మపేట: పండ్లు, బ్రెడ్ ప్యాకెట్లు అందజేస్తున్న మాజీ ఎమ్మెల్యే మెచ్చా, బీఆర్ఎస్ పార్టీ శ్రేణులు


దుమ్ముగూడెం: పార్టీ కార్యాలయంలో కేక్ కట్ చేస్తున్న నాయకులు


కరకగూడెం: మొక్కలు నాటుతున్న నాయకులు, విద్యార్థులు

వైద్య సేవలకు చెట్టు అడ్డు


పూసుకుంటకు వెళ్లే అటవీ మార్గంలో దారికి అడ్డంగా పడి ఉన్న చెట్టు

దమ్మపేట: ఏజెన్సీ ప్రాంత కొండరెడ్లకు వైద్య సేవలు అందించడానికి వెళ్తున్న వైద్య సిబ్బందికి.. అటవీ మార్గంలో దారికి ఓ చెట్టు అడ్డుగా పడి ఆటంకంగా మారింది. పట్వారిగూడెం ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పరిధిలోని వైద్య సిబ్బంది బుధవారం పట్వారిగూడెం నుంచి కొండరెడ్లు నివాసం ఉంటున్న పూసుకుంట గ్రామానికి, వ్యాక్సినేషన్ నిమిత్తం ఆటోలో బయలుదేరారు. ఈ క్రమంలో వారు పూసుకుంటకు అటవీ మార్గంలో ప్రయాణిస్తుండగా, మార్గం మధ్యలో దారికి అడ్డంగా పెద్ద చెట్టు పడి ఉంది. దీనితో వైద్య సిబ్బందికి వెళ్లే మార్గం లేక అక్కడే ఆగిపోయారు. ఈ నేపథ్యంలో పూసుకుంట నుండి దమ్మపేట వైపుకు, మరొక ఆటోలో వస్తున్న కొండరెడ్లు తారసపడ్డారు. దారికి అడ్డంగా ఉన్న చెట్టును కొండరెడ్లు పక్కకు తొలగించగా, ఇరువర్గాలకు దారి సుగుమం అయింది. సంబంధిత అధికారులు, రాజకీయ ప్రతినిధులు జోక్యం చేసుకుని, పూసుకుంటకు రోడ్డు మార్గంను ఏర్పాటు చేయాలని కొండరెడ్లు కోరుతున్నారు.

పనులు ముమ్మరం చేయాలి

దుమ్ముగూడెం: మండలంలో గోదావరి వరద పట్టిన ప్రాంతాల్లో పారిశుద్ధ్య పనులు ముమ్మరం చేయాలని డీఎల్‌పీఓ సుధీర్ పంచాయతీ సిబ్బందిని ఆదేశించారు. బుధవారం మండలంలోని తూరుబాక, పర్ణశాల, లక్ష్మీనగరం పంచాయతీల్లో పర్యటించి పారిశుద్ధ్య పనులను పరిశీలించారు. దోమల నివారణకు తగిన చర్యలు తీసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఆయన వెంట ఎంపీడీఓ ముత్యాలరావు, పంచాయతీ కార్యదర్శులు ఉన్నారు.

విప్లవోద్యమానికి తీరనిలోటు


ములకలపల్లి: చంద్రశేఖర్ చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న నాయకులు

ములకలపల్లి: సీపీఐ(ఎంఎల్) మాస్‌లైన్ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు రాయల చంద్రశేఖర్ మృతి విప్లవోద్యమానికి తీరనిలోటని పార్టీ జిల్లా కార్యదర్శివర్గ సభ్యుడు నూపా భాస్కర్ అన్నారు. మూకమామిడి గ్రామంలో పార్టీ మండల కమిటీ సభ్యుడు శాస్త్ర బోయిన వెంకటేశ్వర్లు అధ్యక్షతన బుధవారం ఏర్పాటు చేసిన చంద్రశేఖర్ సంతాపసభలో పాల్గొన్న ఆయన మాట్లాడారు. తొలుత చంద్రశేఖర్ చిత్రపటానికి పూలమాల వేసి, అంజలి ఘటించారు. ములకలపల్లి, అన్నపురెడ్డిపల్లి సంయుక్త మండలాల కార్యదర్శి కొర్సా రామకృష్ణ, భిక్షం, దాసు, జాన్‌బాబు, ముత్యాలు, నాగేశ్, శ్రీకాంత్ పాల్గొన్నారు.

అశ్వారావుపేటరూరల్: రాయల చంద్రశేఖర్ ఆకాల మరణం సీపీఐ (ఎంఎల్) మాస్‌లైన్ పార్టీకి తీరని లోటు అని, ఆయన ఆశయాలు కొనసాగించాలని పార్టీ పాల్వంచ డివిజన్ కార్యదర్శి గోగినపల్లి ప్రభాకర్ అన్నారు. బుధవారం మండలంలోని కావడిగుండ్ల గ్రామంలో సంస్మరణ సభ నిర్వహించి, రాయల చిత్రపటానికి పూలమాల వేసి ఘన నివాళులర్పించారు. ఈ సందర్భంగా పార్టీ నాయకులు మాట్లాడారు. నాయకులు బాడిస లక్ష్మణరావు, కంగాల కల్లయ్య, వాసం పోతురాజు, కంగాల కాంతమ్మ, సోడెం లక్ష్మి, నూపా మంగ, మాజీ సర్పంచ్‌లు కంగాల భూలక్ష్మి, గొంది లక్ష్మణ్‌రావు, ఎంపీటీసీ బుచ్చిరాజు పాల్గొన్నారు.

సంస్మరణ సభ పోస్టర్లు ఆవిష్కరణ..

భద్రాచలంటౌన్: భద్రాచలం పట్టణంలోని సీపీఐ (ఎంఎల్) మాస్‌లైన్ కార్యాలయంలో రాయల చంద్రశేఖర్ సంస్మరణ సభ పోస్టర్‌ను బుధవారం ఆవిష్కరించారు. ఈనెల 28న ఖమ్మంలో సంస్కరణ సభను ఏర్పాటు చేయనున్నట్లు రాష్ట్ర కమిటీ సభ్యుడు రంగారెడ్డి తెలిపారు. కెచ్చల కల్పన, సాయన్న, శివ, మహేశ్వరి, కుమారి, విజయమ్మ, షకీరా, కృష్ణవేణి, ఫిర్దూస్, రమ పాల్గొన్నారు.

బడ్జెట్ తీరుపై నిరసన



భద్రాచలంఅర్బన్: కేంద్ర ప్రభుత్వానికి వ్యతిరేకంగా నిరసన వ్యక్తం చేస్తున్న సీపీఎం నాయకులు

భద్రాచలంఅర్బన్: కేంద్ర బడ్జెట్‌లో తెలంగాణ రాష్ట్రానికి, భద్రాచలం ప్రాంతానికి తీవ్ర అన్యాయం చేసిన కేంద్ర ప్రభుత్వం విధానాలను ఖండిస్తూ సీపీఎం భద్రాచలం పట్టణ కమిటీ ఆధ్వర్యంలో బుధవారం నిరసన కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా పార్టీ రాష్ట్ర కమిటీ సభ్యులు మచ్చ వెంకటేశ్వర్లు మాట్లాడుతూ.. కేంద్రం ప్రవేశపెట్టిన బడ్జెట్ ప్రజా బడ్జెట్.. బీజేపీ ప్రభుత్వాన్ని కాపాడే నితీష్ కుమార్, చంద్రబాబు బడ్జెట్‌గా ఉందని ఎద్దేవా చేశారు. నిత్యం రాముడి జపం చేసే బీజేపీ.. భద్రాచలం ప్రాంత సమస్యలను పట్టించుకోలేదని, పాండురంగాపురం నుంచి భద్రాచలం వరకు రైల్వే లైన్ నిర్మాణం, ఐదు గ్రామపంచాయతీలను భద్రాచలంలో కలపాలనే స్థానిక ప్రజల ఆకాంక్షను విస్మరించారని అన్నారు. పార్టీ జిల్లా కార్యదర్శి వర్గ సభ్యుడు కారం పుల్లయ్య, ఎంబి.నర్సారెడ్డి, సీనియర్ నాయకుడు జీఎస్ శంకర్‌రవు, పార్టీ పట్టణ కార్యదర్శి గడ్డం స్వామి జిల్లా కమిటీ సభ్యుడు యలమంచి వంశీ, పార్టీ పట్టణ కార్యదర్శి వర్గ సభ్యుడు బండారు శరత్ బాబు, వై.వెంకటరామారావు, లీలావతి, సీతాలక్ష్మి పాల్గొన్నారు.

కరకగూడెం: కేంద్ర ప్రభుత్వ బడ్జెట్లో తెలంగాణకు ప్రాధాన్యం కల్పించకపోవడం బాధాకరమని కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు సయ్యద్ ఇక్బాల్ హుస్సేన్ బుధవారం ఓ ప్రకటనలో ఆవేదన వ్యక్తం చేసారు. గిరిజన యూనివర్సిటీ, పెండింగ్ ప్రాజెక్టుల నిర్మాణానికి నిధులు కేటాయించకుండా తీవ్ర అన్యాయం చేసారని, మూసీ నది ప్రక్షాళన, కోచ్ ఫ్యాక్టరీ ఊసెత్తకుండా కేటాయింపులో వివక్ష చూపడం మంచిది కాదని అన్నారు.

మోదీకి లేఖ..

భద్రాచలంటౌన్: దక్షిణ అయోధ్యగా పేరుగాంచిన భద్రాద్రి అభివృద్ధికి కృషి చేయాలని ప్రధాని నరేంద్ర మోదీకి భద్రాద్రి ప్రాంత పరిరక్షణ సమితీ అధ్యక్షుడు బూసిరెడ్డి శంకర్ రెడ్డి బుధవారం లేఖ రాశారు. బడ్జెట్‌లో తెలంగాణ రాష్ట్రానికి, పోలవరం ముంపునకు గురవుతున్న భద్రాచలం ప్రాంతానికి నిధులు కేటాయించకపోవడంపై ఆయన స్పందిస్తూ.. పలు అంశాలను లేఖలో పేర్కొన్నారు. భద్రాద్రి అభివృద్ధిపై త్వరలోనే సీఎం రేవంత్ రెడ్డికి కూడా లేఖ రాయనున్నట్లు ఆయన పేర్కొన్నారు.